క్లుప్తంగా

పూతదశలో కంది సాగు



యడ్లవానిపాలెంలో కంది సాగు

కె.కోటపాడు: మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో విస్తారంగా కంది సాగు చేస్తున్నారు. ఆర్.వై.అగ్రహారం, చిరికివానిపాలెం, యడ్లవానిపాలెం, వారాడ, ఆనందపురం, వి.సంతపాలెం, కొరువాడ, డి.అగ్రహారం, సింగన్నదొరపాలెం, దాలివలస గ్రామాల్లో 80 ఎకరాల్లో కంది సాగు చేపడుతున్నారు. ప్రధానంగా ఈ సాగుకు మెట్ట ప్రాంతాలు అనుకూలిస్తాయి. తక్కువ నీటి సాంద్రతతో మూడు నెలల కాల వ్యవధిలో పంట చేతికి అందివస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పంట పూత దశకు చేరుకుంది.

మోదమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎం. కోడూరు మోదమాంబ

మాడుగుల రూరల్: మోదమాంబ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎం. కోడూరు మోదమాంబ ఆలయంలో ఉదయం నుంచి భక్తులు దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కె.జె.పురం, ఘాట్‌రోడ్డు జంక్షన్, కాటా వద్ద మోదమాంబ ఆలయాలల్లో పూజలు నిర్వహించారు.

సందడిగా హ్యాపీ సండే వేడుకలు



సందడి చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నర్సీపట్నం: స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలల్లో హ్యాపీ సండే వేడుకలను మున్సిపల్ అధికారులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరిలో సంతోషం నింపేందుకు ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ఈ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆట, పాటలతో అలరించారు. ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో చాలా సంతోషంగా గడిపారు.


3 తాగునీటి బోర్లు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న యర్రాపాత్రుడు, మౌనిక

మాకవరపాలెం: నూతనంగా నిర్మించిన మూడు తాగునీటి బోర్లను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు, తాడపాల సర్పంచ్ లక్కరాజు మౌనిక ప్రారంభించారు. తాడపాలలో నూతనంగా బోర్లు నిర్మించేందుకు మండల పరిషత్ నుంచి రూ.3 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో మూడు బోర్లు నిర్మించారు. ఈ నేపథ్యంలో ఆదివారం వాటిని ప్రారంభించారు. మాజీ సర్పంచ్ లక్కరాజు రాజారావు, గ్రామ పెద్దలు గనిశెట్టి అప్పారావు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు



మందు పిచికారీ చేస్తున్న రైతు

రోలుగుంట: వరి పంటను ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకుని పంటను సంరక్షించుకోవాలని మండల వ్యవసాయాధికారి సిహెచ్.చిరంజీవి తెలిపారు. మండలంలో కె.నాయుడుపాలెం, అడ్డసరం, కొమరవోలు, దిబ్బలపాలెం, తదితర గ్రామాల్లో పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తెగుళ్లకు సంబంధించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంటకు పొడ, పాయ తెగులు సోకాయన్నారు. ప్రారంభంలోనే ఇటువంటి తెగుళ్లను నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలన్నారు. పొగతెగులుకు హెక్సోకొనజోల్‌ను పిచికారీ చేయాలన్నారు. ఆకుముడత తెగులుకు కార్బొఫ్యూరాన్ క్లోరైడు 2 గ్రాములు లీటరు నీటిలోను, లేదా క్లోరోపైర్‌పాస్ 2 ఎం.ఎల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ విధమైన నివారణ చర్యలు తీసుకుని పంటను సంరక్షించుకోవాలన్నారు.

వరికి తెగుళ్ల బెడద

- ఆందోళనలో రైతులు
- దిగుబడులు రావని వేదన



వరి చేలుకు పురుగులు మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

మాడుగుల: వరి పంట తెగుళ్ల బారిన పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పాలు పోసుకుని గింజ కట్టే దశలో మాగుడు(పాముపొడ), తదితర తెగుళ్ల విజృంభిస్తున్నాయి. పలు రకాల క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. గోవాడ చక్కెర కర్మాగారం అప్పుల్లో కూరుకుపోవడంతో రైతులకు చెరకు బిల్లులు చెల్లించలేదు. దాంతో మండల రైతులంతా చెరుకు సాగుకు బదులు వరి సాగుపైనే ఆధారపడ్డారు. దీంతో మండలంలో 15 వేల ఎకరాలకుపైగా వరి సాగు చేశారు. నాట్లు సమయంలో ఎద్దడి రావడంతో నారులు ఎండిపోయాయి. వాటిని కుండలతో తడిపి కాపాడుకున్నారు. తీరా వర్షాలు అనుకూలించడంతో ఖరీఫ్ వరినాట్లు గతేడాది కంటే కొంత ఆలస్యంగా వేసుకున్నారు. నాట్లు వేసిన వెంటనే యూరియా అందుబాటులో లేకపోవడంతో అరకొరగా ఎరువులు చల్లుకున్నారు. అదును దాటిపోయిన తర్వాత ఎరువులు వాడకం వల్ల వరి చేలుకు పని చేయలేదు.

వరుస తపాన్లు

వరినాట్లు వేసిన తర్వాత రోజూ వర్షపు జల్లులతో వరి చేలుకు మాగుడు(పాముపొడ) తదితర తెగుళ్లు సోకాయి. వరి నాట్లు వేసిన దగ్గర నుంచి వర్షాలు అధికమవ్వడంతో క్రిమిసంహారక మందులు పని చేయడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది అంతగా దిగుబడులు రావని వాపోతున్నారు. తరుచూ ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో వరి చేలు నీటి ముంపుకు గురవుతున్నాయి. రోజూ వర్షాలు కురవడంతో ఖరీఫ్ వరి చేలుకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా నివారణ కాలేదని వాపోతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



ఈ ఏడాది ఖరీఫ్ వరి చేలుకు కలసి రాలేదు. వరినాట్లు సమయంలో ఎండలు మండిపోవడంతో కుండలతో నారు తడిపి కాపాడుకున్నాం. నాట్లు వేసిన తర్వాత అధిక వర్షాలు, యూరియా కొరత తదితర సమస్యలతో ఈ ఏడాది ఖరీఫ్ అంతగా కలసి రాలేదు. చెరుకు వేద్దామంటే బిల్లులు సరిగా ఇవ్వలేదు. వరి సాగుపైనే జీవనాధారం. ప్రస్తుతం వరి కూడా అంతంత మాత్రమే, ఎరువుల కొరత, వాతావరణం అనుకూలించక ఇబ్బందులు పడుతున్నాం. రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– చల్లా దేవుడు, రైతు, సత్యవరం, మాడుగుల మండలం

నకిలీ మద్యంపై ధర్నా నేడు



బూడి ముత్యాలునాయుడు

మాడుగుల రూరల్: నకిలీ మద్యం దందా తదితర విషయాలు ఎండగడుదూ రాష్ట్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు సోమవారం ఉదయం మాడుగుల ఎక్సైజ్ స్టేషన్ ఎదుట ధర్నా చేపడుతున్నట్టు మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఈ ధర్నా అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ మండలాలకు చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు. నకిలీ మద్యం కేసులో అధికార పార్టీకి చెందిన నేతలు ఆధారాలతో సహా దొరికిపోయారని, దీన్ని కప్పిపుచ్చేందుకు సర్కార్ ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకొని ప్రతిపక్షంపై నిందలు మోపుతుందని విమర్శించారు. మద్యం దందాపై ప్రభుత్వంలోని పెద్దలకు ఏ మాత్రం సంబంధం లేనట్టయితే ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే సీబీఐతో విచారణ కోరాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు కాళ్ల రాము, బొద్దాపు భాస్కరరావు, మళ్ల కన్నబాబు, పడాల అప్పలనాయుడు, సర్పంచ్‌లు సంజీవిరావు, జామి రమణబాబు, శానాపతి గంగాధర్, కరణం రాము, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అధ్యక్షతన జరగనుందని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విధిగా హాజరు కావాలని కోరారు.

జీతాలందక రెవెన్యూ సిబ్బంది అవస్థలు



బుచ్చెయ్యపేట తహసీల్దార్ కార్యాలయం

బుచ్చెయ్యపేట: మండల రెవెన్యూలో కింద స్థాయి సిబ్బందికి జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దసరా పండగకు జీతం ఇవ్వకపోగా కనీసం దీపావళి పండగకైనా జీతాలు అందించి ఆదుకోవాలంటూ కోరుతున్నారు. ఈ నెల 12వ తేదీ దాటినా మండలంలో పలు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వీఆర్వోలు, వీఆర్ఏలకు జీతాలు అందలేదు. ఒకే కార్యాలయంలో పని చేస్తున్న తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులకు జీతాలు పెట్టుకుని డ్రా చేసుకోగా, కింద స్థాయిలో వీఆర్వో, వీఆర్ఏలు 50 మందికి మాత్రం జీతాలను నిలుపుదల చేశారు. దసరాకు జీతాలు అందక ఇబ్బందులు పడ్డామని, దీపావళికైనా ఇంటిల్లిపాది సరదాగా గడపడానికి జీతాలు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

సందర్శకులు సండే సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు జలకాలాటలు

నాతవరం: సరుగుడు జలపాతం సందర్శకులతో సందడిగా మారింది. ఆదివారం ఇక్కడ ఎత్తయిన రెండు కొండలు మధ్యలోంచి జాలువారే నీటిలో సందర్శకులు జలకాలాటాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. సరుగుడు రోడ్డులో ఒక్కసారిగా వాహనాలు రద్దీ పెరగడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. అదే విధంగా తాండవ రిజర్వాయరు వద్ద సందర్శకులు సందడి నెలకొంది. తాండవ రిజర్వాయరులో నీటిమట్టం పుష్కలంగా ఉండటంతో ఇక్కడా సందర్శకులు సరదాగా కాలక్షేపం చేశారు.

ఘనంగా పసలమ్మ పండగ



పసలమారమ్మకు పూజలను నిర్వహిస్తున్న మహిళలు



సీతంపేట పసలమ్మ పండగ ఊరేగింపులో గ్రామస్తులు

కె.కోటపాడు: చౌడువాడ గ్రామస్తులు ఆదివారం పసలమారమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఇక్కడ సతకంపట్టు పోతురాజు గుడి వద్ద పసలమారమ్మకు పసుపు, కుంకుమ, చీరలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా ఖరీఫ్‌లో పంటలు బాగా పండటంతోపాటు పశువులకు మంచి ఆరోగ్యం కలగాలని పండగను నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా గ్రామ ప్రధాన వీధుల్లో వసంతోత్సవం ఊరేగింపు చేశారు. ఈ వసంతాన్ని రైతులు పొలాలు, పాకల్లోను, పశువులపైనా చల్లారు. ఈ వసంతం చల్లడం వల్ల పశువులు వ్యాధులు బారిన పడకుండా ఉంటాయని రైతుల విశ్వాసం.

సీతంపేటలో..

దేవరాపల్లి: మండలంలోని సీతంపేటలో పసలమారమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పసలమారమ్మకు పసుపు, కుంకుమ, పండ్లు నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పాడి, పంటలు వృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులంతా డప్పులు, వాయిద్యాల నడుమ సాంప్రదాయ బద్ధంగా పసుపుకుంకుమలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి సంతరించుకుంది.

నేడు విద్యుత్ కార్మికుల ధర్నా



ధర్నా గోడపత్రిక ప్రదర్శిస్తున్న కమిటీ సభ్యులు

చోడవరం: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 15వ తేది నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు విద్యుత్ స్ట్రగుల్ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకన్నపాలెం విద్యుత్ ఉప కేంద్రం వద్ద నిరవధిక సమ్మె గోడపత్రికను స్ట్రగుల్ కమిటీ సభ్యులు సిటు నాయకులుతో కలిసి విడుదల చేశారు. ఇందులో భాగంగా సోమవారం చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.వి. శ్రీనివాసరావు స్ట్రగుల్ కమిటీ జిల్లా అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, నర్సీపట్నం సంజీవ్‌కుమార్, ఆర్. సంజీవిరావు, వాసు సత్యనారాయణ, పూడి సత్యనారాయణ, సిటు నాయకులు ఎస్.వి. నాయుడు తెలిపారు. కాంట్రాక్టు, లేబర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విద్యుత్ సంస్థల్లో విలీనం చెయ్యాలని, పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత అపరిమిత వైద్య సౌకర్యం కల్పించాలని, తదితర 12 డిమాండ్లతో కూడిన సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం చేపట్టే చలో విజయవాడ విజయవంతం చేయాలని కోరారు.

కంటైనర్ పార్లర్ ప్రారంభం



పార్లర్‌ను ప్రారంభిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టరు రమాకుమారి

మాడుగుల రూరల్: ఎం.కె. వల్లాపురం పాల సొసైటీ (ఘాట్‌రోడ్డు జంక్షన్)లో రూరల్ మార్కెటింగ్ కంటైనర్ పార్లర్‌ను విశాఖ డెయిరీ డైరెక్టరు, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ఆదివారం ఉదయం ప్రారంభించారు. అనంతరం పాల సొసైటీ సభ్య రైతులు 89 మందికి సిల్వర్ దాణా బేసిన్లు పంపిణీ చేశారు. విశాఖ డెయిరీ డైరెక్టరు శీరంరెడ్డి సూర్యనారాయణ, డెయిరీ సీఈవో కె. వి. ప్రసాదు, చీఫ్ మేనేజర్ సోమునాయుడు, మార్కెటింగ్ ఎస్ఆర్ మేనేజర్ కె. సూర్యప్రకాష్, చోడవరం యూనిట్ మేనేజర్ గుల్లిపల్లి రాము, మాడుగుల ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎం. కోటపాడు, వల్లాపురం సర్పంచ్‌లు, పాల సొసైటీ అధ్యక్షుడు కోట్ని గంగరాజు, కార్యదర్శి మజ్జి రామారావు, సీడీసీ మాజీ చైర్మన్ మజ్జి తాతబాబు, కార్యదర్శులు పాల్గొన్నారు.


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టౌన్ సీఐ గోవిందరావు

నర్సీపట్నం: ఎస్పీ ఆదేశాల మేరకు నర్సీపట్నం టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం సీఐ గోవిందరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లను ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ ఎలాంటి క్రిమినల్ కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచి ప్రవర్తనతో సమాజంలో జీవించాలన్నారు. రౌడీషీటర్ల ప్రవర్తనల్లో మార్పు చోటు చేసుకోవాలన్నారు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిరంతరం మీపై పోలీసు నిఘా ఉంటుందన్నారు.

పాడేరు బస్సులు నడపాలని తీర్మానం



మాట్లాడుతున్న సర్పంచ్ కళావతి, ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనువాసరవు తదితరులు

మాడుగుల: విశాఖపట్నం – పాడేరు ఆర్టీసీ బస్సులు మాడుగుల మీదుగా నడపాలని సర్పంచ్ కళావతి, ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనువాసరవు కోరారు. ఇవి ఘాట్ రోడ్డు జంక్షన్ మీదుగా వెళ్లిపోతున్నాయని వాపోయారు. ఆదివారం స్థానిక దేవి ఆడిటోరియం వద్ద అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వినతి పత్రం అందజేయడానికి తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనువాసరావు, టీడీపీ మండల కార్యదర్శి పుప్పాల రమేష్, జనసేన పార్టీ నాయకుడు రొబ్బా మహేష్, బీజేపీ నాయకుడు మండల సతీష్, కాంగ్రెసు పార్టీ నాయకుడు పడాల కొండలరావు, భారత నిర్మాణ సేన సభ్యుడు మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోడిగరువులో పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



బోడిగరువులో ప్రారంభమైన పాఠశాల భవన నిర్మాణ పనులు

దేవరాపల్లి: చింతలపూడి పంచాయతీ శివారు బోడిగరువులో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ పాఠశాల భవనం నిర్మాణంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో ఆగస్టు 9న 'ఇంకెన్నాళ్లు ...రచ్చబండ చదువులు?' అనే శీర్షికతో ప్రచురితమైన సాక్షి కథనానికి అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. గతంలో ఇదే పంచాయతీ నేరెళ్లపూడి పాఠశాలకు కొన్ని గ్రామాల విద్యార్థులు గెడ్డలు, వాగులు దాటి రావాల్సి వచ్చేది. దాంతో గత వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని గ్రామాలకు మధ్యస్తంగా ఉండేలా బోడిగరువులో పాఠశాల భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో గ్రామానికి చెందిన గుమ్మపు దేవి, దేముడుబాబు దంపతులు పాఠశాల నిర్మాణానికి 9 సెంట్ల స్థలం దానం చేశారు. నాడు–నేడు నిధులు రూ. 28 లక్షలతో భవన నిర్మాణానికి అప్పటి డిప్యూటీ సీఎం బూడి భూమిపూజ చేశారు. బెంచీలు, టీవీ ఇతర పరికరాలు, సామగ్రి సైతం సమకూర్చారు. ఆ సమయంలోనే ఎన్నికల కోడ్ రావడంతో భవన నిర్మాణ పనులకు బ్రేకులు పడ్డాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇక్కడి విద్యార్థుల కష్టాలను పట్టించుకోలేదు. ఈ సమస్యలపై సాక్షిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. అయితే ప్రస్తుతం పాఠశాల బ్యాంక్ ఖాతాలో రూ.4.28 లక్షలు ఉన్నట్టు హెచ్ఎం జి.జగదీశ్వరరావు తెలిపారు.

ఎ.భీమవరంలో సారె ఊరేగింపు



గౌరీపరమేశ్వరులకు సారెను సమర్పించిన భక్తులు

కె.కోటపాడు: ఎ.భీమవరం రామాలయంలో గౌరీపరమేశ్వరులకు సారెను భక్తులు సమర్పించారు. వివిధ రకాల పిండివంటలు తయారు చేసి ఊరేగింపుగా తీసుకెళ్లి గౌరమ్మకు సమర్పించారు. గౌరీపరమేశ్వరులకు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గౌరీపరమేశ్వరుల అనుపు కార్యక్రమాన్ని బుధవారం రాత్రికి వైభవంగా జరపనున్నట్లు సర్పంచ్ తర్రా సన్యాసమ్మశేషు, తర్రా మహేశ్వరరావు, చందు, పార్వతి తెలిపారు.

శస్త్ర చికిత్సలకు 15 మంది ఎంపిక



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం లోటస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సంగివలసలోని అనిల్ నీరుకొండ హాస్పిటల్, బీఆర్డీఎస్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వంద మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. 15 మందిని వివిధ శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి అనిల్ నీరుకొండ హాస్పిటల్‌కు ప్రత్యేక బస్సులో తరలించారు. ఈ శిబిరంలో వైద్యులు పి.చంద్ర, కీర్తి, యోగితలక్ష్మి, వై. శేషుకుమారి, పి.దేవి, కె.ధర్మరాజు, దుర్గరాజు వైద్య సేవలందించారు. బీఆర్డీఎస్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రాపేటి కొండలరావు, స్థానిక స్కూల్ ప్రిన్సిపాల్ పాపారావు, ఆదర్శ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బి.ఎస్. త్రినాథరాజు, రిటైర్డ్ ఎస్‌డబ్ల్యూవో ఆదిరెడ్డి చినకన్నబాబు, కొట్టాన రాంబాబు మాస్టారు, దాసరి మంగునాయుడు తదితర గ్రామ పెద్దలు సహాయ సహకారాలు అందించారు.

ఏఎల్‌పురం సర్పంచ్‌కు ఘన సన్మానం



ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాతను సన్మానం చేస్తున్న స్థానికులు



హాజరైన మహిళలు

గొలుగొండ: ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో ఎస్సీ–బీసీ కాలనీలో సామాజిక భవనం నిర్మాణానికి ఇచ్చిన హామీ నెరవేర్చుకున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాతను స్థానిక రెల్లి కులస్తులు, ఇతర సామాజిక వర్గ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానం చేశారు. సర్పంచ్‌గా లోచల సుజాత పోటీ చేసిన సమయంలో ఇక్కడ సామాజిక భవనం నిర్మిస్తానని హామీ ఇచ్చారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఇక్కడ పర్యటించిన అప్పటి అనకాపల్లి ఎంపీ బి. సత్యవతి, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఎంపీ నిధులు నుంచి రూ.8 లక్షలు మంజూరు చేయడంతో భవనం నిర్మించారు. కాలనీ వాసులు సర్పంచ్‌ను సన్మానించారు. అనంతరం సర్పంచ్ సుజాత మాట్లాడుతూ ఈ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన మాజీ ఎంపీ సత్యవతి, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

హిందూ సంప్రదాయాల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న బ్రాండెక్స్ కంపెనీ అధినేత దొరైస్వామి



కొత్తకోటలో ర్యాలీ చేస్తున్న స్వయం సేవకులు

రావికమతం: భారతీయ సంప్రదాయాలను రక్షించడం, ప్రోత్సహించడం ఆర్ఎస్ఎస్ ప్రథమ కర్తవ్యమని బ్రాండెక్స్ సీఈవో దొరైస్వామి, బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్‌జి పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్(ఆర్ఎస్ఎస్) ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం కొత్తకోటలో స్వయం స్వయం సేవక్‌ల పద సంచలన కార్యక్రమం జరిగింది. ఆర్ఎస్ఎస్ అనకాపల్లి జిల్లా కార్యవాహ జి.పి.ఎస్.నాయుడు(మాస్టార్) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బ్రాండెక్స్ సీఈవో దొరైస్వామి, ముఖ్య వక్తగా బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, హిందూ బంధువులు, రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు, తదితరులు హాజరయ్యారు.